## జూన్ 3 నుంచి 'పది' అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు

● డీఈవో రమేశ్‌కుమార్

నాగర్‌కర్నూల్ టౌన్, మే 31 : జూన్ 3 నుంచి 11 వరకు పదోతరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగనున్నాయని, జిల్లా వ్యాప్తంగా 332 మంది విద్యార్థులు దరఖాస్తులు చేయగా జిల్లాలోని ఒక పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటుచేసినట్లు డీఈవో రమేశ్ ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పదోతరగతిలో వివిధ సబ్జెక్టుల ఫలితాల్లో తప్పిన 332 మంది విద్యార్థులకు అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు జూన్ 3నుంచి 11వ తేదీవరకు జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ పరీక్షలు ఉదయం 9:30 గంటల నుంచి 12:30 గంటల వరకు జరుగుతాయని, మొత్తం 332మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 212మంది బాలురు, 120 మంది బాలికలు ఈ పరీక్షల కోసం జిల్లా కేంద్రంలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హాల్ టికెట్లను ఇప్పటికే విడుదల చేశామని, విద్యార్థులు సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంల నుంచి తీసుకొని పరీక్షల సమయాన్ని కంటే ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు.

## ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న ఎస్సై రామన్‌గౌడ్

పెంట్లవెల్లి, మే 31: ఆన్ లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రామన్‌గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలోని ప్రధాన రహదారిపై వెళ్లే బాటసారులతో పాటు, గ్రామ ప్రజలకు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలతో పాటు, దొంగతనాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. గుర్తు తెలియని వారు తమ మొబైల్‌కు ఫోన్ చేసి బ్యాంక్ ఖాతాకు సంబంధించి ఓటీపీ చెప్పాలంటే వివరాలు ఇవ్వొద్దన్నారు. ముఖ్యంగా తమ ఇండ్లలో చదువుకునే విద్యార్థిని, విద్యార్థులు ఉంటే పేస్‌బుక్, ఇన్ స్టాగ్రాం వంటి ఆన్‌లైన్‌లో అపరిచితుల చిట్‌చాట్ చేయకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ సిబ్బంది రాజన్‌గౌడ్, విష్ణుమూర్తి, అరవింద్‌రెడ్డి, మూర్తి పాల్గొన్నారు.

### నిబంధనలపై అలసత్వం వహించొద్దు

తాడూరు, మే 31: ట్రాఫిక్ నిబంధనలపై అలసత్వం వహించొద్దని ఎస్సై గురుస్వామి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని నాగర్‌కర్నూల్, కల్వకుర్తి ప్రధాన రహదారిపై వాహనాలను తనిఖీ చేయడం తోపాటు డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనల చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాల్లో పరిమితికి మించి ఎక్కించుకోకుండా జాగ్రత్త పడాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నేటి నుంచి అమలయ్యే కొత్త ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు.

## పరిశ్రమ ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న ఎం బాల్ నర్సింహ

అచ్చంపేట రూరల్, మే 31: నల్లమలలో నిరుద్యోగులకు పరిశ్రమలను ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాల్‌నర్సింహ డిమాండ్ చేశారు. శనివారం నియోజకవర్గంలోని సీపీఐ 18వ మహాసభ పట్టణంలోని టీఎన్‌జీవో భవనంలో నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులందరికీ ఎటువంటి షరతులు లేకుండా బ్యాంక్ రుణాలు అందించి రైతు భరోసా పథకం కింద రూ. 2లక్ష అప్పు ఉన్న రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఉమా మహేశ్వర ప్రాజెక్ట్ కింద భూములు కోల్పోయిన రైతులకు రూ. 25లక్షల నుంచి 30 లక్షల వరకు నష్ట పరిహారం చెల్లించాలన్నారు. నియోజకవర్గ కేంద్రంలో ఇంజనిరింగ్, పాలిటెక్నిక్, మహిళ కళాశాలను ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ సభ్యులు కేశవులు, డివిజన్ నాయకులు గోపాల్, మల్లేశ్, శ్రీను, పార్వతమ్మ, విష్ణు, తిరుపతమ్మ, బషీర్, రాములు పాల్గొన్నారు.

## గురుకులాల సెక్రటరీని సస్పెండ్ చేయాలి


నిరసన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కల్వకుర్తి రూరల్, మే 31: దళిత విద్యార్థులను అవమానిపరచిన గురుకులాల సెక్రటరీ అలుగు వర్షిణిని సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు రామార్జున్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని పాలమూరు చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద విద్యార్థుల పట్ల సెక్రటరీ తీరును వ్యతిరేకిస్తూ ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద విద్యార్థుల విద్యను ప్రోత్సహించాల్సిన ఐఏఎస్ అధికారి విద్యార్థుల పట్ల ఇలా ప్రవర్తించడం చాలా దారుణమన్నారు. ప్రభుత్వ స్పందించి గురుకులాల సెక్రటరీ సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. జమాలుద్దీన్, శివప్రసాద్, శివ, రాజు, సంతోష్, జయకృష్ణ పాల్గొన్నారు.

## విత్తనాల నాణ్యతలోపిస్తే చట్టపరమైన చర్యలు


విత్తనాల నాణ్యతను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి కృష్ణయ్య

అచ్చంపేట టౌన్, మే 31: విత్తనాల నాణ్యత లోపిస్తే చట్టపరమైన చర్యలుంటాయని మండల వ్యవసాయ అధికారి కృష్ణయ్య అన్నారు. శనివారం ఆయన పట్టణంలో ఫర్టిలైజర్స్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి మాట్లాడారు.. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో విత్తనాలు కొనుగోలు చేస్తున్నారన్నారు. నాణ్యమైన విత్తనాలను అందించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా పలు రకాల విత్తనాల ప్యాకింగ్‌లను పరిశీలించారు. అదేవిధంగా రికార్డులను, స్టాక్ నిల్వలను తనిఖీ నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**FINANCE**

★Project Finance... MSME, CGTSME, Seed Funding, Private Equity, Venture Capital, Laisoning Services @ KPHB. 7032631468.
NT-350515-All

**WANTED**

★AN Infra DVLP సంస్థలో పని చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టీమ్స్ కావలెను. యాదాద్రి సమీపంలో వెంచర్లకు @ రాక్‌టౌన్ కాలనీ, అలకాపురి, L.B.Nagar, హైదరాబాద్. సంప్ర: 9989747788.
NT-325337-All

**ప్రకటన**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748


# ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలి

● కలెక్టర్ బదావత్ సంతోష్


కల్వకోలులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

పెద్దకొత్తపల్లి, మే31: తేమ శాతం 17 శాతం ఉన్న వెంటనే రైతుల నుంచి వరి ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ ఐకేపీ నిర్వాహకులను ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని కల్వకోలు గ్రామంలోని ఐకేపీ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ అమరేందర్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. వర్షానికి ధాన్యం తడిసిపోకుండా టార్పాలిన్లను కప్పి ఉంచాలన్నారు. రైతుల నుంచి ధాన్యం వెంటనే కొనుగోలు చేసి లారీల్లో ఎక్కించాలన్నారు. రైతులు కూడా పంటలను వెంటనే ఐకేపీ కేంద్రాలకు తీసుకొచ్చి విక్రయించాలన్నారు. కలెక్టర్‌తోపాటు పౌరసరఫరాల అధికారి నర్సింహారావు, డీఎం రాజేందర్, కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్, తాసీల్దార్ శ్రీనివాస్ ఉన్నారు.

### 1.23 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు

నాగర్‌కర్నూల్, మే 31: జిల్లాలో ఇప్పటి వరకు 1. 23 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రికార్డుస్థాయిలో కొనుగోలు చేసినట్లు కలెక్టర్ సంతోష్ పేర్కొన్నారు. రైతులకు చెల్లింపులు జరిగాయని, జిల్లాలో రైతు పండించిన ప్రతి గింజను చివరి వరకు కొనుగోలు చేస్తామన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 232 కేంద్రాల ద్వారా కొనుగోళ్లు జరుగుతున్నాయని, జిల్లాలో గత రబీ సీజన్ కంటే ఎక్కువగా ధాన్యం కొనుగోళ్లు, గతంలో కంటే వేగంగా రైతులకు చెల్లింపులు జరుగుతున్నాయన్నారు.

### కొల్లాపూర్ ఇండోర్ స్టేడియం పరిశీలన

కొల్లాపూర్ రూరల్, మే 31: పట్టణంలోని ఇండోర్ స్టేడియాన్ని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు వేసవి సెలవులను వృథా చేయకుండా ఇష్టమైన కళలలో ప్రావీణ్యం పొందడంతోపాటు జీవితంలో మనోధైర్యాన్ని సంపాదించుకునేందుకు ఇలాంటి సాంస్కృతిక, కళా శిక్షణ తరగతులు ఎంతోగానో ఉపయోగపడతాయని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు మంచి కళలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న రత్నగిరి ఫౌండేషన్ వారిని ప్రశంసించారు. కార్యక్రమంలో కలెక్టర్ తోపాటు అదనపు కలెక్టర్ అమరేందర్, క్రీడల శాఖ అధికారి సీతారాం నాయక్, ఆర్డీవో బన్సిలాల్, రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ ధర్మతేజ తదిరులు పాల్గొన్నారు.

### ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజం

బిజినేపల్లి, మే 31: ప్రతి ఉద్యోగికి ఏదో ఒక రోజు పదవీ విరమణ అనేది ఉంటుందని కలెక్టర్ సంతోష్ అన్నారు. శనివారం మండలంలోని ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో తాసీల్దార్ శ్రీరాములు పదవీ విరమణ సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోనే పెద్ద మండలంగా ఉన్న బిజినేపల్లి మండలంలో సేవలు అందించడం అభినందనీయమన్నారు. అనంతరం తాసీల్దార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఉద్యోగస్తులు, రాజకీయ నాయకులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు

నాగర్‌కర్నూల్, మే 31: తెలంగాణ రాష్ట్ర 11వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు జిల్లా కేంద్రంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ సంతోష్ తెలిపారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా ప్రభుత్వం నియమించిన రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి హాజరు కానున్నట్లు చెప్పారు. జూన్ 2న పరేడ్ గ్రౌండ్ ఆవరణ వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు పరేడ్‌లో అమరవీరుల స్థూపానికి నివాళులర్పించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారన్నారు. జిల్లాలో అమలు చేస్తున్న వివిధ శాఖల పరిధిలోని ప్రభుత్వ సంక్షేమ పథకాల అభివృద్ధి పనుల వివరాలను వివరిస్తూ ప్రసంగించనున్నట్లు తెలిపారు. వేడుకలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులకు బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు.

## 3నుంచి రెవెన్యూ సదస్సులు

కల్వకుర్తిరూరల్, మే 31: కల్వకుర్తి పట్టణంలోని తాసీల్దార్ కార్యాలయంలో జూన్ 3 నుంచి ప్రారంభం కానున్న రెవెన్యూ సదస్సు కార్యక్రమంపై ఆర్డీవో శ్రీను అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రెవెన్యూ సదస్సుల నిర్వహణ తదితర అంశాలపై తాసీల్దార్, డీటీలు, ఆర్‌ఐలకు అవగాహన కల్పించారు.

*వెల్దండలో..*

వెల్దండ, మే 31: మండలంలో ఈ నెల 3నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తాసీల్దార్ కార్తిక్‌కుమార్ తెలిపారు. శనివారం తాసీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మండలంలోని 16రెవెన్యూ గ్రామ పంచాయతీల్లో 3నుంచి 12 వరకు రెవెర్యూ అధికారులు 2 బృందాలుగా ఏర్పడి సదస్సులు నిర్వహిస్తారని తెలిపారు. 3న అజిలాపూర్, లింగారెడ్డిపల్లి, 4న బొల్లంపల్లి, గుండాల 5న పెద్దాపూర్, కోనేటివాడతాండ, 6న బైరాపూర్, పోతేపల్లి, 9న చెర్కూర్, రాచూర్, 10న కుప్పగండ్ల, 11న చెదురుపల్లి, కొట్ర 12న వెల్దండ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో డీటీ కిరణ్‌కుమార్, ఆర్‌ఐ శైలజా, శంకర్ ఉన్నారు.

## నిబంధనలను పరిగణలోకి తీసుకోవాలి..

నాగర్‌కర్నూల్ టౌన్, మే 31: 2015 నాటి అసంబద్ధమైన రేషనలైజేషన్ నిబంధనలు పాటించడంతో ఉపాధ్యాయులలో గందరగోళం నెలకొని ఉందని, ప్రభుత్వమిచ్చిన రేషనలైజేషన్ నిబంధనలు ప్రాథమిక విద్య వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నాయని పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రతి ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ ఏర్పాటుచేసి ఆ సంఖ్యను కూడా సర్దుబాటు నిబంధనలోకి పరిగణలోకి తీసుకోవాలన్నారు. సమావేశంలో పీఆర్టీయూ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పీఆర్టీయూ నాయకులు

## హైదరాబాద్‌కు తరలుతున్న 68పశువులు పట్టివేత


వెల్దండలో పట్టుబడ్డ ఆవులు

వెల్దండ, మే 31: మండలంలోని కొట్ర గేటు వద్ద అక్రమంగా తరలిస్తున్న పశువును పోలీసులు పట్టుకున్నారు. వివరాలిలా.. శ్రీకాకుళం జిల్లా తుని నియోజకవర్గం నుంచి హైదరాబాద్‌కు కంటైనర్‌లో 68 పశువులను తరలిస్తుండగా మండలంలోని కొట్ర చౌరస్తాలో ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్‌పోస్టు వద్ద శనివారం తెల్లవారుజామున పోలీసులు వాహనాన్ని నిలిపి కంటైనర్‌ను తనిఖీ చేయాగా 2 వరుసలో పశువులు ఉండగా వాటిని మండలంలోని ఓ గోశాలకు తరలించారు. గోశాలకు తరలించిన ఆవులను డాక్టర్ శ్యాంసుందర్ పరిశీలించారు. అనారోగ్యానికి గురైన పశువులకు సెలైన్లు పెట్టి చికిత్స చేసినట్లు తెలిపారు. బక్రిద్ పండుగ ఉన్నందునే పశువులను తీసుకెళ్తున్నట్లు తెలిసింది. కార్యక్రమంలో పోలీసులు సిబ్బంది ఉన్నారు.

# పొగాకుకు దూరంగా ఉండాలి..

● డీఎంహెచ్‌వో స్వరాజ్యలక్ష్మి


ప్రతిజ్ఞ చేస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు

నాగర్‌కర్నూల్, మే 31: పొగాకును దూరంగా ఉంచి ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని డీఎంహెచ్‌వో డాక్టర్ స్వరాజ్యలక్ష్మి సూచించారు. శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించారు. పాత కలెక్టరేట్ నుంచి పట్టణంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. వైద్య సిబ్బంది అందరిచే పొగాకు ఉత్పత్తులు వినియోగించొద్దని, స్నేహితులు, కుటుంబ సభ్యులు, పరిచయస్తులందరికీ పొగాకు ఉత్పత్తులు వినియోగించకుండా అవగాహన కలిగిస్తారని, పొగాకు ఉత్పత్తుల వాడకం నుంచి పర్యావరణ పరిరక్షణకు సహకరిస్తానని ప్రతిజ్ఞ చేయించారు. పొగ తాగడం, పొగాకు ఉత్పత్తులైన గుట్కా, తంబాకు, జర్దా తదితర ఉత్పత్తులను వినియోగించడంతో శరీరంలో రక్తనాళాలు, మెదడు, గుండె జీర్ణ వ్యవస్థ వంటి అవయవాలపై దుష్ప్రభావం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా పొగాకును వ్యతిరేకిస్తూ ప్రతిజ్ఞ చేశారు. సహచరులు, పరిసరాల ప్రభావంతో సరదాగా ప్రారంభమై వ్యసనంగా మారుతుందన్నారు. 18 సంవత్సరాలలోపు వారికి పొగాకు ఉత్పత్తులు అమ్మకూడదని, పాఠశాలల పరిధిలో వంద మీటర్లలోపు పొగాకు ఉత్పత్తిలో అమ్మడం నిషేధం అన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ కృష్ణమోహన్, అధికారి రవికుమార్, డాక్టర్ వాణి, విజయ్‌కుమార్, మల్లేశ్, నీరజ్, శ్రీనివాసులు, రాజేశ్, శ్రీనివాసులు, ఫసియొద్దీన్, జ్యోతి సురేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

*అమ్రాబాద్‌లో..*

అమ్రాబాద్, మే 31: మండలంలోని మన్ననూర్ గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు సుధాకర్ వైద్య సిబ్బందితో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించి పొగాకు ద్వారా కలిగే నష్టాలను ప్రజలకు వివరించారు. అదేవిధంగా పొగాకు తీసుకోవడంతో మన శరీరంలో ప్రతి యొక్క అవయవానికి కలిగే నష్టాలను వచ్చే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు గౌతం, ఆయుష్ వైద్యులు జాన్సన్, పీహెచ్‌ఎన్ రాజేశ్వరి, ముత్తమ్మ, ఆరోగ్యకార్యకర్తలు సరస్వతి, నారాయణమ్మ పాల్గొన్నారు.

*కొల్లాపూర్‌లో..*

కొల్లాపూర్ రూరల్, మే 31: పట్టణ కేంద్రంలోని సివిల్ కోర్టులో మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లాయర్ భాస్కర్‌రెడ్డి మాట్లాడారు.. పొగాకు ద్వారా కలిగే నష్టాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో భూజల భాస్కర్ రెడ్డి, పనుగంటి బాలస్వామి, నిరంజన్, మోహన్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

## 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

బిజినేపల్లి, మే 31: బీసీలకు విద్యా, ఉద్యోగాలపై 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలని బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు అజయ్‌కుమార్ యాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం గేటు ఎదుట బీసీలకు 42శాతం రిజర్వేషన్‌కోసం ఏర్పాటు చేసిన రిలే దీక్షలో పాల్గొన్నారు. ప్రపంచంలో ఏ దేశంలో లేని విధంగా మన దేశంలో కుల వివక్షత కొనసాగుతుందన్నారు. దేశంలో సుమారు 2640 కులాలు వెనుకబడిన తరగతులుగా గుర్తించడం జరిగిందన్నారు. ఇందులో 2500లకు పైగా కులాలు నేటికీ చట్టసభల్లో అడుగు పెట్టింది లేదన్నారు. దేశంలోని 50శాతానికి పైగా జనాభా పెరిగిన బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ కల్పించాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీవోకు అందజేశారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుర్మయ్య, నాయకులు సత్యశిలా సాగర్, రాజేందర్ గౌడ్, వెంకట స్వామి, అరవిందాచారి, మనోహర్, భగవంత్ గౌడ్, శంకర్ గౌడ్, రఘుబాబు, శ్రీనివాసులు, ఆంజనేయులు పాల్గొన్నారు.

## తరగతులలో ప్రవేశాలకు ఆహ్వానం

నాగర కర్నూల్ రూరల్, మే 31: జిల్లాలోని ఎస్సీలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు 2025 -26 విద్యా సంవత్సరానికి గాను, బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో 1,5 తరగతులలో ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి శనివారం ప్రకటనలో కోరారు. విద్యార్థులు తల్లిదండ్రుల వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతాల వారు 2 లక్షలు, గ్రామీణ ప్రాంతాల వారు రూ. 1.50 లక్షలకు మించని వారు అర్హులని పేర్కొన్నారు. అలాగే 5వ తరగతిలో ప్రవేశం పొందు విద్యార్థులు దరఖాస్తుతో పాటు కులం, ఆదాయం, స్థానికం, 4వ తరగతి పాస్ అయిన బోనఫైడ్ సర్టిఫికెట్‌లపై గజిటెడ్ అధికారిచే సంతకం చేపించి, జూన్ 16 సాయంత్రం 5గంటలలోగా జిల్లా కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


నాగర్‌కర్నూల్: ర్యాలీలో పాల్గొన్న యోగా శిక్షకులు

నాగర్ కర్నూల్ రూరల్, 31: యోగాసనాలు, కరోనా వంటి మహమ్మారి నుంచి కాపాడింది మన దేశీయ వైద్యమని జిల్లా దవాఖాన యునాని వైద్యుడు డాక్టర్ షాబజ్ మాలిక్ తెలిపారు. యోగా సాధన పట్ల ప్రజల్లో అవగాహన కలిగించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా డే ఒకే భూమి ఒకే ఆరోగ్యం అనే నినాదంతో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో యోగా దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తుందని ఆయన తెలిపారు. అందులో భాగంగా మే 27 నుంచి జూన్ 21 వరకు జిల్లాలోని ప్రజల్లో వివిధ రూపాల్లో యోగాతో కలిగే ఆరోగ్య లాభాలపై పాఠశాలల విద్యార్థులకు, ప్రజలకు అవగాహన నిర్వహిస్తున్నామని తెలిపారు. ఫార్మసిస్ట్ మురళి కృష్ణగౌడ్, యోగా శిక్షకులు సాగర్, రవీందర్, అంజలి, సిబ్బంది పాల్గొన్నారు.

*చారకొండలో..*

చారకొండ, మే 31: అంతర్జాతీయ యోగా దినోత్సవ దశాబ్ది వేడుకల్లో భాగంగా శనివారం మండలంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆధ్వర్యంలో యోగాపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్యురాలు గాయత్రి, మండల వైద్యులు మంజుభార్గవి యోగాతో కలిగే ప్రయోజనాలపై వివరించారు. వైద్య సిబ్బంది దేవేందర్, కవిత, బిచ్యానాయక్, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

## చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

పెద్దకొత్తపల్లి, మే 31: మండలంలోని జొన్నలబోగుడలో శనివారం చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటుచేసుకున్నది. వివరాలిలా.. గ్రామానికి చెందిన శివకుమార్ (35) కేఎల్ఐ ప్రధాన కాల్వలో చేపలను పట్టేందుకు వెళ్లాడు. చేపల వేటకు వెళ్లిన వ్యక్తి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు కేఎల్ఐ కాల్వవద్దకు వెళ్లి చూడగా నీటిలో మునిగిపోయి చనిపోయినట్లు గమనించారు. మృతుడి తల్లి బురాణమ్మ ఫిర్యాదుమేరకు ఎస్సై సతీశ్ కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## భర్తపై భార్య కేసు నమోదు

బల్మూరు, మే 31: భర్తపై భార్య కేసు నమోదు చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకున్నది. పోలీసులు వివరాల ప్రకారం.. మండలంలోని జీనుకుంట గ్రామానికి చెందిన నమ్రతా కర్ణాటక రాష్ట్రం చిక్కాబల్లాపూర్‌కు చెందిన శ్రీనాథ్ రెడ్డితో ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. పెళ్లైన కొన్నాళ్లకు భర్త ఇబ్బందులు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. నమ్రత ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాదేవి తెలిపారు.

## రిమాండ్‌కు తరలింపు

బల్మూరు, మే 31 : మండలంలోని మహాదేవ్‌పూర్ గ్రామానికి చెందిన దేవమ్మ, పద్మమ్మలను శనివారం రిమాండ్‌కు తరలించారని ఎస్సై రమాదేవి తెలిపారు. గ్రామానికి చెందిన మల్లయ్యపై వారం రోజుల క్రితం భార్య, అత్త కత్తితో హత్యాయత్నం చేశారు. బాధితుడి అక్క విజయలక్ష్మి ఫిర్యాదుమేరకు కేసునమోదు చేశామని తెలిపారు. వీరిని కల్వకుర్తి కోర్టుకు హాజరుపర్చడం జరిగిందని ఆమె సూచించారు.

## కారు గ్యారేజీలో అగ్ని ప్రమాదం

కల్వకుర్తి, మే 31: కల్వకుర్తి పట్టణం హైదరాబాద్ రోడ్డులో భవానీ కారు గ్యారేజీలో శనివారం రాత్రి మంటలు అంటుకున్నాయి. ఫైర్ సర్వీసుకు చుట్టుపక్కల వారు ఫోన్ చేయడంతో ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు అర్పారు. షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం సంభవించినట్లు తెలుస్తుంది. దాదాపు రూ.10 నుంచి 12లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితుడు శివ తెలిపారు.

## నిందితుడికి రిమాండ్

కల్వకుర్తి, మే 31: కల్వకుర్తి పట్టణానికి చెందిన ముత్యం యాదవ్‌ను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మాధవరెడ్డి తెలిపారు. మే 24న తెల్లవారు జామున పట్టణంలోని తిలక్‌నగర్ కాలనీకి చెందిన కృష్ణవేణి యువతి ఉరేసుకుని మృతి చెందింది. యువతి ఆత్మహత్యకు ముత్యం యాదవ్ కారణమని ఆరోపిస్తూ యువతి తల్లిదండ్రులు పోలీసులకు, ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. యువతి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సాంకేతిక ఆధారాలు సేకరించి ముత్యం యాదవ్‌ను అరెస్ట్ చేశారు.


అరెస్టు అయిన యూటీఎఫ్ నాయకులు

## బాధితులకు న్యాయం చేయాలి

అచ్చంపేట టౌన్, మే 31: హైదరాబాద్‌లో శనివారం నిర్వహించ తలపెట్టిన ఉపాధ్యాయ సంఘాల సమావేశానికి వెళ్లే సమయంలో పోలీసులు ఉదయం ముందస్తు అరెస్టు చేశారని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో రాకముందు మేము అధికారంలో వచ్చిన వెంటనే 317 బాధితులకు న్యాయం చేస్తామని చెప్పి ఇంతవరకు చేయలేదని అన్నారు. అదేవిధంగా కమిటీ వేసి కాలయాపన చేసి కొండను తవ్వి ఎలుకను పట్టినట్టుగా 317 బాధితులకు న్యాయం చేయలేకపోయిందని వాపోయారు. స్థానికులను వేరే జిల్లాలకు అలాట్‌మెంట్ చేసి వారి కుటుంబాలకు ఇబ్బంది పాలు చేస్తున్నదన్నారు. ప్రభుత్వం మా గోడును అర్థం చేసుకొని స్థానికత ఆధారంగా వారి జిల్లాలోనే అలాట్‌మెంట్ చేసే విధంగా కృషిచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు కొౌ్రశంకర్, నాయకుడు సైదులు, బాబురావు, దశరథం, బలరాం ఉన్నారు.

## రజతోత్సవాలకు తరలిన జర్నలిస్టులు


అల్లం నారాయణను కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న జర్నలిస్టులు

అచ్చంపేట రూరల్, మే 31 : తెలంగాణ జర్నలిస్టు ఫోరం (టీజేఎఫ్) ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ జలవిహార్‌లో నిర్వహించిన 25 వసంతాల రజతోత్సవ వేడుకలకు నల్లమల జర్నలిస్టులు తరలివెళ్లారు. తెలంగాణ మీడియా అకాడమి మాజీచైర్మన్ అల్లం నారాయణను, అరుణోదయ విమలక్కను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో చందూనాయక్, బండారు శ్రీనివాస్, మహ్మద్ రవూఫ్, బాలింగం, శేఖర్, శివ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జర్నలిస్టులను శాలువాతో సన్మానించి జ్ఞాపికను మీడియా అకాడమి మాజీ చైర్మన్ అల్లం నారాయణ చేతుల మీదుగా అందుకున్నారు.

## రుణ మంజూరు పత్రాల పంపిణీ

వంగూరు, మే 31: రాజీవ్ యువ వికాసం కోసం లక్ష వరకు దరఖాస్తు చేసుకున్న యువతీ, యువకులకు జూన్ 2న రుణాలు మంజూరు పత్రాలను అందజేయనున్నట్లు ఎంపీడీవో బ్రహ్మచారి శనివారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 38 మంది లబ్ధిదారులకు రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వారికి మంజూరు పత్రాలను అందించేందుకు ఉన్నతాధికారులు నిర్ణయించారన్నారు.

## ఉచిత ధ్యాన శిక్షణ విజయవంతం

నాగర్‌కర్నూల్ టౌన్, మే 31: జిల్లా కేంద్రంలోని ఈశ్వర పిరమిడ్ ధ్యాన మందిరంలో ఒక్క రోజు నిర్వహించిన ఉచిత ధ్యాన శిక్షణ కేంద్రం విజయవంతంగా నిర్వహించారు. ఈ శిక్షణలో కూకట్‌పల్లి నుంచి లక్ష్మి జ్ఞాన దాతగా పాల్గొని ధ్యానం ఎలా చేయాలో వివరించారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ ధ్యాన శిక్షణ కొనసాగింది. కార్యక్రమంలో 70 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో స్వప్న, తిరుపతయ్య, మధు, రాణి తదితరులు ఉన్నారు.

## కేంద్రవ్యతిరేక విధానాలపై పోరాడాలి

బల్మూరు, మే 31 : కేంద్ర ప్రజావ్యతిరేక విధానాలపై ప్రతిఒక్కరూ పోరాడాలని సీపీఎం జిల్లా నాయకుడు దేశ్యానాయక్ అన్నారు. శనివారం మండలకేంద్రంలో పార్టీ శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో కార్పొరేట్ శక్తులకు పెట్టుబడిదారులకు రాయితులను ఇస్తూ పేద ప్రజలకు అన్యాయం చేస్తున్నారన్నారు. ఉపాధి కూలీలకు రూ.4 వందలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకుడు శంకర్‌నాయక్, లాలఅహ్మద్, బాబర్, ఆంజనేయులు, బాలు, నాగయ్య, రాజు, శ్రీరామ్, తదితరులు ఉన్నారు.

## బీఎస్పీ నాయకుడిపై కేసు ఎత్తివేయాలి

నాగర్‌కర్నూల్ రూరల్, మే 31: జిల్లాలో నిరంతరం ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తున్న బీఎస్పీ రాష్ట్ర ఈసీ మెంబర్ బండి పృథ్వీరాజుపై పోలీసులు ప్రాథమిక ఆధారాలు లేకుండా కేసు పెట్టడం సరికాదని సామాజిక ఉద్యమ కారుడు వావిలాల రాజశేఖర్ శర్మ అన్నారు. పేదల పక్షాన నిలబడి, అన్యాయానికి వ్యతిరేకంగా పోరాటాలు చేపట్టే వారిని గొంతు నొక్కే ప్రయత్నం చేయడం, ప్రజాపాలన ప్రభుత్వంలో సమంజసం కాదన్నారు. వెంటనే వారిపై పెట్టిన కేసును ఎత్తివేయాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

## ఉపాధ్యాయ సర్దుబాట్లను నిలుపుదల చేయాలి

అచ్చంపేటరూరల్, మే31: అసంబద్ధమైన ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను వెంటనే నిలుపుదల చేయాలని ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్ ముదిరాజ్ శనివారం ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బడిబాటలో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ప్రస్తుతం నడుస్తున్న తల్లిదండ్రుల సమావేశాలను ఏమాత్రం పరిగణలోకి తీసుకోకుండా గత ఏడాది విద్యార్థుల ఆధారంగా సర్దుబాటు చేయడం దారుణమన్నారు. జూన్ 13వరకే ప్రక్రియను పూర్తిచేయాలని ఉత్తర్వులు విడుదల చేయడం అన్యాయమన్నారు. జూన్ చివరినాటికి నమోదయ్యే విద్యార్థుల సంఖ్య ఆధారంగా చేయాలని డిమాండ్ చేశారు.

## దాయాదుల మధ్య భూతగాదా

తాడూరు, మే 31:మండలంలోని ఐతోల్‌లో గత కొన్నేళ్లుగా దాయాదుల మధ్య భూతగాదాలు కొనసాగుతున్నాయి. ఈక్రమంలోనే శనివారం గ్రామానికి చెందిన జైపాల్ రెడ్డి అతడి భార్య తిరుపతమ్మ కలిసి పొలానికి వెళ్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి మధ్య గొడవ జరిగింది. ఒకరి నొకరు తోసుకుంటున్న క్రమంలో జైపాల్ రెడ్డి వద్ద ఉన్న గొడ్డలిని కృష్ణారెడ్డి తీసుకుని దాడికి పాల్పడడం జరిగింది. దీంతో జైపాల్‌రెడ్డి అతడి భార్య తిరుపతమ్మకు గాయాలు కావడంతో జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ ఘటనపై ఎస్సై గురుస్వామిని వివరణ కోరగా.. దీనికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.